క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళ వారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్తిబాబు కుటుంబానికి పరిహారమివ్వాలని వినతి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగంలో ఎలక్ట్రికల్ హెల్పర్‌గా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుడు ఎం.సత్తిబాబు ప్రమాదవశాత్తు మరణించాడని, అతడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, సంస్థ నుంచి ఇవ్వాల్సిన ఇతర పరిహారాలు మంజూరు చేయాలని జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు మంగళవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. మురళీనగర్ వద్ద విద్యుత్ పోల్‌పై సత్తిబాబు మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై, స్తంభం పైనుంచి కింద పడటం వల్ల మరణించాడన్నారు. జీవీఎంసీలో 15 ఏళ్లుగా సత్తిబాబు పనిచేస్తున్నాడని, ఎక్స్‌గ్రేషియాతోపాటు సంస్థ ఇవ్వాల్సిన పరిహారాలు మంజూరు చేయాలని కమిషనర్‌ను బాణాల కోరారు.

ఆంజనేయ ఆలయంలో మన్యుసూక్త హోమం




దేవాలయంలో మన్యుసూక్త హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతి నెలా పౌర్ణమి రోజున ఆలయంలో హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థాన కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఈ హోమంలో దేవస్థానం కౌంటర్‌లో రూ.516 చెల్లించిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఓట్ల దొంగ గద్దె దిగాలని ర్యాలీ

అల్లిపురం: 'ఓట్ చోర్ గద్దె చోడ్' నినాదంతో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమానికి మద్దతుగా మంగళవారం నగర కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ, కడప జిల్లా మాజీ అధ్యక్షుడు గుండ్లకుంట్ల శ్రీరాములు హాజరై ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ ర్యాలీ జీవీఎంసీ నుంచి రామ్‌నగర్ మీదుగా సెవెన్‌హిల్స్ హాస్పిటల్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర మాజీ అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గుత్తుల శ్రీనివాసరావు, మౌనికరెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: బంగారుమెట్ట శ్రీ గౌరీ సేవా సంఘం, శ్రీ రామాంధ్ర యువజన సమాజం, ద్వారకానగర్ లయన్స్ క్లబ్ సంయుక్తంగా మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బీపీ, షుగర్‌తోపాటు కంటి వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెంటకోట గణేష్, కార్యదర్శి టి.తేజేశ్వరరావు, కోశాధికారి వై.శేఖర్, మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ బీశెట్టి హనుమంతరావు పర్యవేక్షించారు. సుమారు 300 మంది వైద్య సేవలు పొందారు.

నిర్వీర్యం

- సచివాలయాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- జీవీఎంసీ 41వ వార్డులో చిన్న ఇరుకు గదిలోనే 3 కేంద్రాల నిర్వహణ
- వాటిలో ప్రింటర్లు పనిచేయక ఇబ్బందులు
- బయట ప్రింట్ తీసుకోమంటున్న సిబ్బంది
- కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్న లబ్ధిదారులు



మూలకు చేరిన ప్రింటర్లు



జ్ఞానాపురం 307వ నంబర్ సచివాలయంలో పని చేయని మానిటర్.. నిరుపయోగంగా ఉన్న ప్రింటర్



మూడు సచివాలయాలు నిర్వహిస్తున్న ఇరుకు గది ఇదే

కంచరపాలెం: జీవీఎంసీ జోన్ – 5 పరిధి 41వ వార్డు జ్ఞానాపురంలో పలు సచివాలయాల్లో ప్రింటర్లు, మానిటర్లు పనిచేయకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జ్ఞానాపురం మరియదాస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బాబూ కాలనీ (309వ నంబరు), సెబాస్టియన్ కాలనీ (308వ నంబరు), జ్ఞానాపురం (307వ నంబరు) సచివాలయాలను ప్రస్తుతం జోన్ – 5 జోనల్ కార్యాలయంలోని ఓ ఇరుకు గదికి తరలించారు. జేఎస్ఎస్ఆర్ యూఎం కాలనీ, గెడ్డవీధి, బాబూకాలనీ, స్లీప్‌గుర్తు వీధి, రాసవీధి, మాన్యువల్ స్ట్రీట్, కొండవీధి తదితర కాలనీల ప్రజలు జ్ఞానాపురం సచివాలయాలనే వినియోగిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో సచివాలయాలు నిర్వీర్యం అవుతున్నాయని చెప్పడానికి జ్ఞానాపురం సచివాలయాలను నిదర్శనంగా చెప్పవచ్చని స్థానికులు అంటున్నారు.

ఇరుకు గదిలోనే 3 కేంద్రాల సిబ్బంది విధులు

సచివాలయాల సిబ్బంది ఏమాత్రం సరిపడని ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. జోనల్ కార్యాలయంలోని ఓ ఇరుకు గదిలోనే మూడు కేంద్రాల సిబ్బందీ విధులు నిర్వహించేందుకు అవస్థలు పడుతున్నారు. మరోవైపు వివిధ పనులు, ధ్రువపత్రాల కోసం వచ్చే వినియోగదారులు కార్యాలయం వెలుపలే వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో లబ్ధిదారులు ఎక్కువ మంది వస్తే సచివాలయ కార్యాలయం వద్ద ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. వారంతా ఇరుకు ప్రదేశంలోనే నిరీక్షించాల్సి వస్తోంది.

ప్రింటర్లు పనిచేయక లబ్ధిదారులకు అవస్థలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని నెలల నుంచి సచివాలయాల్లో ప్రింటర్లు పని చేయడం లేదు. అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయాలను పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. వాస్తవానికి సచివాలయాల్లో జారీ చేసే కుల, నివాస, ఆదాయ ధ్రువ పత్రాలకు సంబంధించిన ప్రింట్లు కూడా అక్కడే ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ప్రింటర్లు సక్రమంగా పని చేయకపోవడంతోపాటు సరిపడా స్టేషనరీ లేకపోవడంతో సిబ్బంది సర్టిఫికెట్లు వెనుక స్టాంపు వేసి సంతకాలు చేసి నెట్ సెంటర్లు, మీ – సేవా కేంద్రాల్లో ప్రింట్ తీసుకోండంటూ లబ్ధిదారుల వాట్సాప్ నంబర్లకు ఆయా ధ్రువపత్రాలు పంపుతున్నారు. ఈ విధానం ఇబ్బందికరంగా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. కొందరు లబ్ధిదారులు సచివాలయ సిబ్బందితో వాదనకు దిగుతున్నా ప్రయోజనం శూన్యం. మరోవైపు ఇటీవల సచివాలయ సిబ్బంది బదిలీ అయ్యారు. కొత్త సిబ్బంది విధుల్లో చేరినా పాత కంప్యూటర్లు, పనికిరాని ప్రింటర్లతో తంటాలు పడుతున్నారు. ఈ సమస్యలపై సచివాలయ సిబ్బంది, అధికారులను అడిగితే ప్రింటర్లు మరమ్మతులకు తరలించామని చెబుతున్నారని లబ్ధిదారులంటున్నారు. ఇప్పటికైనా జోన్ – 5 అధికారులు స్పందించి సచివాలయాల్లో ప్రింటర్లు, మానిటర్లకు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.



308వ నంబర్ సచివాలయంలో మూలకు చేరిన సీపీయూ, ప్రింటర్

అధికారులు స్పందించాలి

ఏడాది నుంచి సచివాలయాల్లో ప్రింటర్లు సక్రమంగా పని చేయడం లేదని జోనల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దాఖలాలు కనిపించడం లేదు. ప్రింట్ కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంలో అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. – ఎస్.కె.బాషా, బాబూకాలనీ, జ్ఞానాపురం

ప్రింట్ కోసం ఇబ్బందులు

ధ్రువ పత్రాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్లు బయట ప్రింట్ తీసుకోవాలని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. గతంలో ప్రింటర్లు పని చేయకపోతే సిబ్బంది దగ్గరుండి మరమ్మతులు చేయించి వినియోగదారులకు అందించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రం లబ్ధిదారుల వాట్సాప్ నంబర్లకు ధ్రువపత్రాల ఫొటో పంపించి ప్రింట్ తీసుకోమని చెబుతున్నారు.
– ఎస్.దాసు, స్లీప్‌గుర్తు వీధి, జ్ఞానాపురం

సీజేఐ గవాయ్‌పై దాడి మతోన్మాదానికి నిదర్శనం



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

డాబాగార్డెన్స్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం జగదాంబ జంక్షన్‌లో సీపీఎం నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కొత్తపల్లి లోకనాథం మాట్లాడుతూ సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరిట సీజేఐ గవాయ్‌పైకి మతోన్మాద అడ్వకేట్ కోర్టులో అందరూ చూస్తుండగానే బూటు విసరడం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందన్నారు. ఇది రాజ్యాంగంపై దాడని, దీనికి పాల్పడిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోదీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే బూటు విసరడం రాజ్యాంగానికి, దేశ ప్రజలకు అవమానమన్నారు. ఇదే సనాతన ధర్మమని ప్రధాన మంత్రి భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. దీనిపై ప్రధాని జవాబు చెప్పాలన్నారు. సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్న పవన్ కల్యాణ్ దీన్ని బలపరుస్తారా? వ్యతిరేకిస్తారా? చెప్పాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అరికట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వై.రాజు, ఎం.సుబ్బారావు, రాజు, నాయుడు, జ్యోతీశ్వరరావు, కుమార్ మంగళం తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం పేరుతో మతోన్మాద చర్యలు

బీచ్‌రోడ్డు: సీజేఐ బీఆర్ గవాయ్‌పై కోర్టు హాల్‌లో మతోన్మాది న్యాయవాది బూటు విసిరి దాడికి పాల్పడటం సనాతన ధర్మం పేరుతో మతోన్మాద చర్యని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సీపీఐ జిల్లా సమితి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ పరివార శక్తులు దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి విభజన తీసుకొస్తూ ఈ సమాజంలో వెదజల్లిన విష సంస్కృతికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడికి ప్రతీకన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సనాతన ధర్మం పేరుతో రాజకీయాలు చేస్తూ ముందుకెళ్తున్న నేపథ్యంలో సీజేఐపై జరిగిన దాడిని సమర్థిస్తారా.. లేక వ్యతిరేకిస్తారా అని స్పష్టంగా రాష్ట్ర ప్రజలకు తెలియజేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మధరావు, నెయ్యల నాగభూషణరావు, ఎం.ఎ.బేగం, కాసుబాబు, పుష్పలత, ఆదినారాయణ, శ్రీనివాస్, రాము, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డే-నైట్ షెల్టర్లపై కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఈ నెల 10న ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డే-నైట్ షెల్టర్లపై డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించి, షెల్టర్ల స్థితిగతులపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమీక్ష చేశారు. ఏయూటీడీ సంస్థ నడుపుతున్న మూడు షెల్టర్లకు రెండేళ్ల నుంచి గౌరవ వేతనం, రాత్రి భోజనం నిధులు ఇవ్వడం లేదని ఏయూటీడీకి చెందిన ప్రగడ వాసు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నెలకు ఒక్కొక్క షెల్టర్‌కు రూ.61,000 చెల్లించడంలో జీవీఎంసీకి వచ్చిన ఇబ్బంది ఏంటని, దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకొని నిధులు ఇచ్చే చూడాలని ఆయన కోరారు. మిగతా 5 షెల్టర్లకు బాగానే చెల్లిస్తున్నారని, ఏయూటీడీకి మాత్రం చెల్లించడం లేదన్నారు. పాత బిల్లులు క్లియర్ చేసి, జీతాలు ప్రతీ నెలా ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్లు వర్మ, రమణమూర్తి, యూసీడీ పీడీ సత్యవేణి, ఏయూటీడీ తరపున జ్యోతిర్మయి పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు

ఇసుకకొండకు భారీగా భక్తులు



రమా సహిత సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజికొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువజామున 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతోపాటు రూ.20, రూ.200, రూ.300 టికెట్లు అందుబాటులో ఉంచారు. వేకువజామున 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు.



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు.

భక్తుల కష్టాలకు విముక్తి

రమా సహిత సత్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు విముక్తి కలిగింది. గతంలో స్వామి దర్శనానికి వెళ్లాలంటే కేజీహెచ్ మార్చురీ మీదుగా, ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డులో గల ఆంధ్రా మెడికల్ కళాశాల అటానమీ విభాగం మీదుగా వెళ్లేవారు. మరికొంత మంది భక్తులు సాలిపేటలో గల మెట్ల మార్గం మీదుగా స్వామి దర్శనానికి చేరుకునేవారు. ప్రస్తుతం ఘాట్‌రోడ్డు అందుబాటులోకి రావడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలో వచ్చే ప్రయాణికులు నేరుగా కొండపైకి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు.

గాజాలో మారణహోమం ఆపాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పౌర చైతన్య వేదిక సభ్యులు

బీచ్‌రోడ్డు: గాజాలో ఇజ్రాయెల్ సృష్టించిన మారణహోమానికి రెండేళ్లయిన సందర్భంగా దాడులను తక్షణం ఆపాలని పౌర చైతన్య వేదిక మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టింది. వేదిక విశాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.కోలవెన్ను చాంద్ ప్రసంగిస్తూ పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని, యుద్ధ నేరస్తులు నేతన్యాహూ, ట్రంప్‌లను శిక్షించాలని, మోదీ ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గాజాలో జరిగిన ప్రాణనష్టం మానవత్వమున్న అందరినీ కదిలిస్తోందన్నారు. అమెరికా అండతో గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న దురాగతాలను ఆయన తీవ్రంగా ఖండించారు. పౌర చైతన్య వేదిక విశాఖ కార్యదర్శి సిహెచ్.ప్రమీల మాట్లాడుతూ గాజా మారణహోమంపై ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థ బీఈఎల్, అదానీ కంపెనీలు ఇజ్రాయెల్‌లోని ఎల్బిట్ కంపెనీతో రక్షణ ఒప్పందాలను కుదుర్చుకుని యుద్ధ టెక్నాలజీని అందించి, పరోక్షంగా యుద్ధానికి తోడ్పడుతోందని ఆరోపించారు. వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.గోవిందరాజులు మాట్లాడుతూ ప్రపంచ ప్రజాభిప్రాయం తక్షణ కాల్పుల విరమణ, పాలస్తీనా రాజ్యానికి గుర్తింపును కోరుతున్న సమయంలో.. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక సామ్రాజ్యవాద ఉద్దేశం, కుట్రను బహిర్గతం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.అఖిలాష్, సంతోష్, సృజన్, సామాజిక కార్యకర్తలు రామప్రభు, విజ్ఞానంద తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలకాలి



వైఎస్సార్‌సీపీ 33వ వార్డు నూతన బూత్ కమిటీ సభ్యులు

అల్లిపురం: ఈ నెల 9న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు 33వ వార్డు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాలతో 33వ వార్డు అధ్యక్షుడు ముత్తబత్తుల రమేష్ వార్డు, బూత్ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వలంటీర్ విభాగం కార్యదర్శి పచ్చిరిపల్లి రాము ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. విశాఖ ఎయిర్‌పోర్టుకు ప్రతి వార్డు నుంచి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లి వైఎస్ జగన్‌కు ఘనంగా స్వాగతం పలకాలని నిర్ణయించినట్లు ముత్తాబత్తుల రమేష్ తెలిపారు. కార్యక్రమంలో 33వ వార్డు కొత్త బూత్ కమిటీ సభ్యులను సత్కరించారు.

జీఎస్‌టీ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న హైస్కూల్ విద్యార్థులు

అల్లిపురం: జీఎస్‌టీ ప్రయోజనాలపై మహాత్మా గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. జీఎస్‌టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీలక్ష్మి, జీఎస్‌టీవో ఎం.శ్రీనివాసరావు, జీఎస్‌టీవో పద్మావతి, ఏఈవో కె.భారతి, ఎంఈవో బి.పైడాపునాయుడు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంజీఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం మాట్లాడుతూ జీఎస్‌టీ ప్రయోజనాలపై అధికారులు చెప్పిన విషయాలను తల్లిదండ్రులకు వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాస రచన పోటీలో మొదటి బహుమతి ఎం.హాసిని, రెండో బహుమతి హరిప్రియ, మూడో బహుమతి ఆకాష్ గెల్చుకున్నారు. డ్రాయింగ్ పోటీల్లో రాకేష్ ప్రథమ స్థానంలో, మోహిత్ ద్వితీయ స్థానంలో, అభిషేక్ తృతీయ స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయులు రాధాదేవి, ఉమాగాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

జీవీఎంసీలో వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

డాబాగార్డెన్స్: సంస్కృత సాహిత్యంలో పేరెన్నిక గల మహాకవి వాల్మీకి అని, ఆదికవిగా, మహాజ్ఞానిగా, సంస్కృతంలో రామాయణ మహా కావ్యాన్ని రచించిన మహనీయుడని, మహర్షి వాల్మీకి జీవిత విశేషాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఇతర అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. శ్రీరాముని కథను చెప్పే సంస్కృత ఇతిహాసం, రామాయణాన్ని రచించి ఈ ప్రపంచానికి అందించిన మహాకవి వాల్మీకి అని, అవి హిందూ మతంలోనూ, దక్షిణాసియా సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్యత కల్గిన గ్రంథాలని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ, పరిపాలన విభాగాధికారి అప్పలనాయుడు, పర్యవేక్షకులు శ్రీనివాస్, రియాజ్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన



సిరులతల్లికి కుంకుమార్చన చేస్తున్న అర్చకులు



హరిజవహర్‌లాల్ కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందజేస్తున్న వేదపండితులు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే లక్ష కుంకుమార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఈ ప్రత్యేక పూజ జరిగింది. లక్ష కుంకుమార్చనలో రూ.10 వేలు చెల్లించిన భక్తుల తరఫున నలుగురు దంపతులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుందన్నారు. పూజలో పాల్గొన దలచిన భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో పూజా రుసుం చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989 లేదా మెయిల్ ఐడీ endowoekanaka@gov.in ద్వారా పంపవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

- దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ కుటుంబ సమేతంగా కనకమహాలక్ష్మిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికి, వారిచే అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ ఎన్.సుజాత, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో రాజేంద్రకుమార్ వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు అలాట్మెంట్ లెటర్లు



అలాట్మెంట్ లెటర్ అందజేస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: రెండో విడతగా ఐటీఐ పూర్తి చేసిన అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తన ఛాంబర్‌లో అలాట్మెంట్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రెంటిస్ షిప్ చేస్తున్న వారు తప్పనిసరిగా వివిధ డిపోల్లో భద్రత ప్రమాణాలు పాటించాలని, సరైన పనిముట్లతో పని నేర్చుకోవాలన్నారు. అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన వారిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ డిపోల్లోకి తీసుకుంటామని తెలిపారు. అందుకు సమీపంలో ఉన్న డిపోల్లో సంప్రదించాలని సూచించారు. అలాగే 18 నెలల హెవీ డ్రైవింగ్ లైసెన్స్ గల వారిని సమీపంలో ఉన్న డిపోల్లో ఆన్ కాల్ డ్రైవర్లుగా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వేతన బకాయిలకు సరిపడా భూమివ్వండి



మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

బీచ్‌రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన బకాయిలు బాగా పెరిగిపోతున్నాయని, వీటి విలువకు సరిపడా ప్రభుత్వ భూమిని వారికి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన జీవీఎంసీ కార్యాలయం దరి వైఎస్సార్ పార్క్‌లోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన విశాఖపట్నం కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిల గురించి సవివరంగా ఉద్యోగులందరికీ తెలియజేస్తున్నామన్నారు. మొత్తం రావాల్సిన బకాయిలన్నింటినీ వారి సర్వీస్ రిజిస్టర్‌లో ముందుగా పొందుపరచాలని చెప్పారు. ఆ సొమ్ముకు తగ్గ ప్రభుత్వ భూమిని ఉద్యోగులందరికీ ఇచ్చి బకాయిల సమస్యను పరిష్కరించాలని సూర్యనారాయణ కోరారు. సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు డి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే శాఖ ఉన్నతాధికారులకు అభినందనలు

మహారాణిపేట: విజయవాడ నుంచి పదోన్నతిపై విశాఖపట్నం జిల్లా డైరెక్టర్ ఆఫ్ సర్వేగా బాధ్యతలు స్వీకరించిన కె.రమణమూర్తిని, సహాయ సంచాలకుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బీబీబీవీ రాజును పలువురు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ సర్వే ఎంప్లాయీస్ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు పంపాన కనకబాబు ఆధ్వర్యంలో సర్వేయర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజనల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే భీమిలి డివిజన్ కొండలరావు, సంఘ సభ్యులు, సర్వే, రెవెన్యూ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.